# మధుర భావన-19

సుమజా.....

ముందుగా నన్ను క్షమించు. నీతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు...ప్రస్తుతం నేను చాలా గందరగోళం లో వున్నాను..నువ్వు దయచేసి ప్రశాంతంగా ఈ ఉత్తరం చదువు. ఈ రోజు అన్ని విషయాలూ నీతో పంచుకోవాలనిపిస్తుంది............

.........................................................................................................................

సుమా...నాకే సమస్య వచ్చినా, ఆనందం కలిగినా అన్నీ అమ్మతో పంచుకోవటం నాకు ఎంతో స్వాంతననీ, సంతోషాన్నీ ఇస్తుంది ! అలాంటిది...ఇప్పుడు అమ్మతోనే సమస్య వచ్చింది, తన అనారోగ్యరూపంలో. ఇక నాకు స్వాంతన కలిగించేది ఎవరూ...నువ్వే మరి ! అందుకే ఈ ఉత్తరం! అమ్మ తర్వాత అంతటి అనుబంధం ఏర్పడింది నీతోనే సుమా...నిజం !

చిన్నప్పటినుంచీ అమ్మా నాన్నల అనురాగం చూస్తూ పెరగటంవలనో...నాన్న చెప్పే మధుర భావ లహరి వలనో....వైవాహిక జీవితం మీద నాకు చాలా కలలు వుండేవి. నేను నా జీవిత భాగస్వామి ఎలా వుండాలని కలలు కన్నానో...అంతకు మించిన బాహ్య సౌందర్యమే కాదు...నీ అంతః సౌందర్యం కూడా నన్ను కట్టిపడేసింది. నిజం సుమా..నా అంత అదృష్టవంతుడు లేడని విర్రవీగానేమో విధి కి మన ప్రేమ మీద కన్ను కుట్టింది. ఈ రోజు తిలోత్తమ వల్ల నువ్వు బాధ పడటం నన్ను కలిచివేసింది. కానీ ఎందుకో గత కొన్ని రోజులుగా అమ్మ మనసుకు గాయం అవటం...అనూషకి సంబంధించిన విషయమేమో అనే అనుమానం నన్ను వేధిస్తుంది. అమ్మ చిన్నప్పటినుంచీ.. అనూషనూ నన్నూ ఎంతో అపురూపంగా పెంచింది. నిజానికి సవతి కొడుకునీ...స్వంత కూతురినీ ఒకేలా పెంచటం అరుదైన వ్యక్తిత్వం కల మా అమ్మ లాంటి వాళ్ళకే సాధ్యమేమో కూడా ! ఇంకా చెప్పాలంటే...అనూ కన్నా, పెద్ద కొడుకుగా అమ్మ నాకే కొంచెం ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేది కూడా ! అయితే సుమా...చిన్నప్పుడు నన్ను ఎంతగానో ఆరాధించే అనూ ...రాను రానూ మెల్లగా దూరం జరగటం నేను గమనించాను. బహుశా అనూ కూడా అమ్మకి తనే స్వంత కూతురనీ...నేను వేరే తల్లి కొడుకుననీ మా బంధువులు చెప్పే మాటలు వినగా వినగా అలా మారిందా.. ఏమిటో నాకు అర్థం అయ్యేది కాదు. ఎందుకంటే..నా ఆలోచనల్లో ఏ మార్పూ లేదు...రాదు కూడా. ఈ మధ్యనే తన స్వభావంలో వచ్చిన మార్పుకి అమ్మ కూడా చాలా బాధ పడటం నేను గమనించాను. అయితే నాకు అమ్మ, అనూషా ముఖ్యం కానీ ఆస్తిపాస్తులు కావని అమ్మకి చెప్పినా తను స్థిమితపడినట్టుగా లేదని ఇప్పుడు నాకనిపిస్తుంది. అందుకే తిలోత్తమను ప్రేమిస్తున్నట్టు, తననే పెళ్ళి చేసుకుంటానని అమ్మ దగ్గర చెబితే ఎలా వుంటుందో చూడాలనుకుంటున్నా. ఈ నాటకం అమ్మ లో స్పందన కలగజేయాలనే తప్ప నాకు వేరే ఉద్దేశాలేవీ లేవు...నమ్ముతావు కదూ ! నిజానికి కలలో కూడా నీతో తప్ప వేరెవరితోనూ నేను నా జీవితం వూహించుకోలేను సుమా !

ఈ రోజు తిలోత్తమతో కూడా నా నాటకం గురించి చెప్పి అమ్మ దగ్గరకు వెళ్తాను. త్వరలో అమ్మకు సంభందించిన శుభవార్త నీతో పంచుకోవాలని ఆశిస్తున్నాను !

ఇక వుంటాను.

ఎప్పటికీ నీ వాడిగానే మిగిలిపోయే ...

నీ వంశీ.

ఉత్తరం ముగించేటప్పటికి సుమజ కళ్ళ నుండా నీళ్ళు నిండటం వలన అక్షరాలు కూడా అలికేసినట్టు అయిపోయాయి. తను వంశీని ఎంత అపార్థం చేసుకుందీ ? తిలోత్తమ మాటలకు వంశీ మనసు గాయపడినట్టు గమనించినా కూడా తను అవివేకిలా, ఆ అమ్మాయి మాటలను నమ్మి తొందరపడి వంశీ ని నిందించి ఫోన్ పెట్టేసింది... కళ్ళు తుడుచుకుంటూ సుమజ బాధ పడింది.

అటుగా వెళ్తున్న భార్గవి...సుమజని చూసి కంగారు పడుతూ దగ్గరకు వచ్చి ఆదుర్దాగా..." ఎవరినుంచమ్మా ఆ ఉత్తరం ? నువ్వు ఆ వంశీ గురించే ఆలోచిస్తూ మనసు పాడు చేసుకోకు. అతని బుద్ధి ఎలాంటిదో ముందే తెలిసినందుకు మనం సంతోషించాలేగానీ....బాధ పడటం వలన ఏమీ ప్రయోజనం లేదు. సుమా..చిన్నప్పటినుంచీ నిన్ను అపురూపంగా పెంచాం. నువ్వు అడిగింది ఏదీ కాదనలేదు. ఇప్పుడు కూడా చూడు..నాన్న తన ఫ్రెండుకి ఇచ్చిన మాటను కూడా కాదని నీ ఇష్టానికే విలువ ఇచ్చారా...అతనిలా చేస్తాడని ఎవరం వూహించలేముకదా ! వంశీనే కాదు...అతని అమ్మ వ్యక్తిత్వం చూసి కూడా నేను చాలా సంతోషించాను. మేమెలా గారాబంగా... అపురూపంగా నిన్ను చూసుకున్నామో అంతకు మించిన ఆదరణ...అభిమానం నీకు అత్తవారింట్లో దొరుకుతుందని భ్రమపడ్డాను కూడా ! కానీ ఇలా జరుగుతుందని అస్సలు వూహించనే లేదు..." గొంతు బొంగురు పోగా భార్గవి మాట్లాడలేక తల తిప్పుకుంది కళ్ళు తుడుచుకోవటానికి.

"అమ్మా...ఇవి కన్నీళ్ళు కావు...ఆనంద భాష్పాలు !" అంటూన్న కూతురి వైపు విచిత్రంగా చూస్తూ సుమజ తల్లి " ఏం మాట్లాడుతున్నావే ...జోకులు వేసేట్టు వుందా మన మనః స్థితి " అంది దీర్ఘంగా నిట్టూరుస్తూ. " నిజం అమ్మా...వంశీ అలాంటి నిర్ణయం తీసుకున్నాడంటే నిజంగా నా మనసు నమ్మట్లేదు, ఇన్నాళ్ళూ...ఇప్పుడు నమ్మకం ,కుదిరింది..నా మనసు నన్నెప్పుడూ మోసం చెయ్యదని. ఈ ఉత్తరం చదువు. నీకు అన్ని సమాధానాలు దొరుకుతాయి. అమ్మా...వంశీ ని మొదటి చూపులో చూసీ చూడంగానే సినిమాల్లో చెప్పినట్టుగా నా ఎదలో గంటలు మోగినట్టే అనిపించింది. తర్వాత తనతో పరిచయం పెరిగిన తర్వాత అప్పటిదాకా నాలో లేని అలజడి వంశీ సమక్షంలో కలిగేది. తనతో మాట్లాడుతుంటే గంటలు నిమిషాల్లా దొర్లిపోయేవి. అదే తన కోసం ఎదురు చూస్తున్నప్పుడు మాత్రం...నిముషాలు కూడా గంటల్లా భారంగా గడిచేవి. చిత్రమైన అనుభూతి ! నీకు తెలుసా అమ్మా..తను నన్ను ఎంత ఆరాధిస్తాడో...మీ ఇద్దరినీ అంతే ఇష్టపడతాడు...గౌరవిస్తాడు. మీలాంటి అమ్మానాన్నల దగ్గర పెరిగినందుకు..మీ పెంపకాన్ని తను కూడా ఆరాధిస్తుంటే..నాకు ఎంత గొప్పగా గర్వంగా

ఉండేదో ! నిజానికి నేను కూడా అంతే ! వంశీ మాట్లాడుతున్నంతసేపూ ఎక్కువ తన తల్లి గురించి ఆరాధనా..చెల్లి గురించి అభిమానం... ఇవే కబుర్లు ఉంటాయి..కానీ నాకెప్పుడూ చిరాకు కానీ..అసూయ కానీ కలగలేదు. ఇంకా ఎక్కువ అభిమానంగా అనిపించేది. నిజం అమ్మా...తల్లినీ, చెల్లినీ ప్రేమించలేని వాడు భార్యని ఎలా ప్రేమిస్తాడని నమ్ముతాం చెప్పు ! అంతే కదూ ! ఆడదంటే తనతో సమానంగా ప్రేమించేవాడు...అమ్మతో సమానంగా గౌరవించేవాడు...సోదరితో సమానంగా అభిమానించేవాడూ కావాలనే కదూ ఏ అమ్మాయైనా కలలు కనేది ! వంశీ లో ఈ లక్షణాలన్నీ చూసే ఇష్టపడ్డాను. తను ప్రేమించానన్నప్పుడు మురిసిపోయాను. కానీ ఇంతలో వాళ్ళ అమ్మగారి అనారోగ్యం వలన మా జీవితాల్లో చాలా నాటకీయ సంఘటనలు జరిగాయి. కానీ ఇప్పుడవన్నీ మబ్బుల్లా విడిపోయినందుకు నా మనసు చాలా తేలికగా వుందమ్మా...తనకి నా పై వున్న ఆరాధనా...అభిమానం నేనెప్పుడూ పోగొట్టుకోకుండా వుండటానికి ప్రయత్నిస్తాను." ....కూతురు చెబుతూండగానే ఆత్రుతగా ఆ ఉత్తరాన్ని చదివిన భార్గవి సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయింది.

"నిజమా..ఇదంతా తను ఆడబోయే నాటకమా...నా మనసు కూడా చాలా తేలికగా అనిపిస్తుంది ఇప్పుడు. వెంటనే మీ నాన్నగారికి ఈ విషయం చెబుతాను. ఆయన దిగులు కూడా తీరుతుంది. నువ్వు వెంటనే మరి వంశీ కి ఫోన్ చేసి అక్కడ ఏం జరిగిందో వివరాలు కనుక్కో " అంటూ ఆవిడ హడావుడిగా ఆనందంతో తబ్బిబ్బు పడుతూ వెళ్ళిపోయింది.

గుండె నిండా ఆనందపు దొంతరలు పొంగుతుండగా..మనసు మురిపాల ఉయ్యాలలూగుతుండగా మూగబోయిన సుమజ కొంతసేపు అలానే అచేతనావస్థలో ఉండిపోయింది.

****

సరిగ్గా అదే సమయానికి వంశీ హడావుడిగా శ్యామసుందరి దగ్గరకు వెళ్ళి... "అమ్మా...ఈ ఉత్తరం చదువు. నేనిపుడే చదివాను. నాకెంత ఆనందం కలిగిందో చెప్పలేను. నీకూ అలానే అనిపిస్తుంది." వంశీ మాటలకు ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ..." ఉత్తరమా..ఎక్కడనుండి వచ్చిందీ ? ఎవరు రాసారూ..?" అనడిగింది.

తల్లి మాటలకు వంశీ హుషారుగా నవ్వాడు. " మన అనూ రాసింది. నువ్వు ఇంటికి ఆరోగ్యంగా వచ్చిన ఆనందంతో పాటూ అనూ ఇలా రాయటం...నాకు మరింత ఆనందంగా ఉంది ! నిజం చెప్పాలంటే..ఆనందంతో తట్టుకోలేనంత ఉక్కిరి బిక్కిరిగానూ ఉంది !" వంశీ కళ్ళు మిలమిలలాడేయి, మనసులోని ఆనందాన్ని పట్టి చూపిస్తున్నట్లుగా.

" అనూ రాసిందా ఉత్తరం..? " అంటూ ఆవిడ ఆ కాగితాలని చదవటం మొదలుపెట్టింది.

" వంశీ అన్నయ్యా....

నేనిలా ఉత్తరం నీకు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుందేమో కదూ ? ఫోను చేసి చెప్పొచ్చుగానీ...నా మనసు విప్పి వివరంగా మాట్లాడటానికి ఉత్తరమే సరి అయిన మార్గంగా అనిపించి ఇలా రాయటం మొదలు పెడుతున్నాను.

మా ఆడపడుచు తిలోత్తమ నాకు ఫోను చేసి ' నా ఆలోచన ఫలించే సూచనలు కనిపిస్తున్నాయనీ, తన అందానికి నువ్వు ఆకర్షితుడివైనట్లుగా మార్పు కనిపిస్తోందనీ,' చెప్పింది. నిజానికి అలా జరగాలని కోరుకున్నదే నేను. తననీ ఒప్పించి పంపిందీ నేనే...కానీ ఆ మాట విన్నపుడు నాకు కలగవలసినంత ఆనందం కలగలేదు. అది నాకే ఆశ్చర్యంగా అనిపించింది. బహుశా తప్పు చేస్తున్నానేమోననే మధన మనసులో ప్రారంభమైనందువలనే అనుకుంటా. ఆ వార్త వినగానే నిరాసక్తంగా లోపలకి వచ్చాను. నా చీరలన్నీ సర్దుదామని బీరువా తెరిచానా... పట్టు చీరల మధ్య భద్రంగా దాచిన పెయింటింగ్ కనిపించింది. అది మా పెళ్ళి రోజున నువ్వు ఇచ్చిందే. చాలా విలువైన కానుకగా భావించి నాతో పాటుగా ఇక్కడకు తెచ్చుకున్నాను.

నీకు గుర్తుందా..ఆ రోజు నాన్న నీకిస్తున్న స్థలం అమ్మ పేర రాయాలనుకుంటున్న విషయాన్ని చెప్పి తను ఎప్పుడూ కలలు కనే ' మధుర భావన' అంటూ ముగ్గురినీ కూర్చోబెట్టి చెప్పారు. ఆ రోజే ఈ పెయింటింగ్ వేసానని చెప్పి నాకు చూపించావు. ఓ అందమైన భవనానికి 'మధుర భావన ' అని పేరు పెట్టి, ఆ ఇంటిముందున్న లాన్ లో ఇద్దరు భార్యాభర్తలు కూర్చుని వుంటే, వాళ్ళకి దూరంగా ఇద్దరు పిల్లలు ఆడుకుంటూన్నట్లుగా ఉంది ఆ బొమ్మ.

నేనది చూస్తూనే ' ఇది మన ఇల్లు...వీళ్ళిద్దరూ మన అమ్మా, నాన్నలు అయితే...ఆడుకుంటూన్న పిల్లలు మనమిద్దరమూనా?' అనడిగా. నువ్వేం జవాబు చెప్పకుండా నవ్వేస్తూ ' ఎలా అనుకున్నా సరే ' అన్నావు.' అంటే...పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నారు కాబట్టి మనమిద్దరం కాదు... కాబట్టి భవిష్యత్తులో నీ కాబోయే భార్యా, నువ్వూ, నీ పిల్లలూ కాబోలు...నాన్న ఇచ్చే స్థలంలో ఇల్లు  కట్టి, ఆ ఇంటికి 'మధుర భావన ' అని పేరు పెడతావన్నమాట! అవునా..? 'అని, ' ఇది నాకిచ్చేయ్యకూడదూ..నా దగ్గిర దాచుకుంటానూ...' అనడిగా.

నువ్వు నవ్వుతూనే కాదన్నట్లుగా తలవూపి, ఆ కాగితాన్ని తీసుకు వెళ్ళిపోయావు. నా పెళ్ళయి అత్తారింటికి వెళ్ళటానికి నేను నా బట్టలూ అవీ సర్దుకుంటున్నప్పుడు...ఆ పెయింటింగ్ తెచ్చి నా చేతుల్లో పెట్టావు. నేను ఆశ్చర్యంగా అదేమిటన్నట్లు చూస్తుంటే...అప్పుడు చెప్పావు.

' ఆ ఇల్లు నీది....ఆ ఇంటిముందు కూర్చున్న వాళ్ళు...నువ్వు, సాకేత్ బావ...ఆడుకుంటూన్న వాళ్ళు, మీ పిల్లలు...అర్థమైందా ? ' అన్నావు. అపుడు ఇంకో మాటా చెప్పావు.

' నేను నాన్న ఇచ్చే స్థలంలో కట్టబోయే ఇంటికి పెట్టబోయే పేరు ' మధుర భావన ' అయితే అవ్వచ్చుగానీ, నువ్వు ఎక్కడ వుంటే...ఆ ఇల్లు మధుర భావనలతో మధుర జీవనానికి మారుపేరుగా వుంటుందనేది నా నమ్మకం. అలా ఉండాలనేది నా కోరిక కూడా...అందుకే నువ్వడిగిన ఈ పెయింటింగ్ నీకీరోజు నా కానుకగా ఇస్తున్నాను ' అన్నావు.

" మరి...నేనడిగినపుడు ఇవ్వనన్నట్లుగా చూసావుగా..?' అన్నా.

" నువ్వు అత్తామామలూ, ఆడబడుచూ, మరిదీ ఉన్న ఉమ్మడి కుటుంబంలోకి కోడలివిగా వెళ్తున్నావు ! ఆ బొమ్మలో ఇద్దరు మాత్రమే కూర్చున్నట్లు, వాళ్ళిద్దరి పిల్లలు ఆడుకుంటున్నట్లు ఉందిగా...అందుకని నీకు సరిపోదేమో అనుకున్నాగానీ....ఇప్పుడు నా అభిప్రాయంలో మార్పు వచ్చింది. ఆలోచిస్తే..అందరూ ఇంట్లో ఉంటే,

మీరిద్దరూ మాత్రమే అలా బయట కూర్చున్నట్లుగా అనుకోవచ్చుగా అనిపించింది ! అందుకే...ఈ రోజు దానిని నీకిస్తున్నాను !' అని చెప్పి ఇంకో మాటా అన్నావు..' నువ్వు చాలా అదృష్టవంతురాలివి అనూ..!' అని.

'ఎక్కువమంది ఉన్న ఇంటికి కోడలిగా వెళ్తున్నందుకేనా..?' అనడిగా.

' కేవలం అదే కారణం కాదు..కాకపోతే అదీ ఒక కారణమే ! ఏమిటో...మన పెద్దవాళ్ళు సంబంధాలు చూసేటప్పుడు ఎక్కువమంది ఉంటే కొంచెం అసంతృప్తిగా చూస్తారు. అంటే..పంపకాలప్పుడు ఆస్తిపాస్తులు తరిగిపోతాయని ! కానీ కొందరు మాత్రం ఎక్కువ మంది ఉంటేనే కష్ట సుఖాలలో అందరూ అండగా ఉంటారనీ, బంధాలూ, అనుబంధాలతో బాగుంటారనీ భావిస్తారు. నిజానికవే అసలైన ఆస్తిపాస్తులని నువ్వెప్పుడో గుర్తించావు. అది నా భావన కూడా ! అంతే కాకుండా నీ అసలైన అదృష్టం గురించి చెప్పనా..? సాకేత్ నిన్ను నిన్నుగా మాత్రమే తన జీవితానికి సహచరిగా కోరుకున్నాడు ! ఈ విషయం నేనెలా గుర్తించానో చెబుతా.

పెళ్ళి మాటలు జరుగుతున్నప్పుడు నేనూ నాన్న పక్కనే ఉన్నా. పద్ధతి ప్రకారం అడగాలని అడుగుతున్నా అంటూ మీ అత్తామామలు మనకున్న ఆస్తిపాస్తుల్లో ఏవో కావా;అని అడుగుతుంటే..నాక్కొంచెం అసహనం కలిగింది ! నాన్నకీ అలానే ఉందేమో..కొంచెం ఆలోచిస్తూ ' ఆ పొలమా....ఇదా..' అంటూ నసుగుతుంటే...సాకేత్...అదే పెళ్ళి కొడుకు నాన్నతో ఓ మాట అన్నాడు ! ' మీరేది మీ అమ్మాయికి ఇవ్వాలనుకుంటే, అదే ఇవ్వండి. అదీ ఇదీ అనేం లేదు...ఏదైయినా అభ్యంతరం లేదు. ఏం ఆస్తిపాస్తులు లేకుండా మీ అమ్మాయిని మా ఇంటికి పంపినా చాలు ! తను మా ఇంటికి రావటమే ఒక వరం అనుకుంటా ! నచ్చిన అమ్మాయి భార్యగా రావటం కంటే వేరే ఆస్తిని కోరుకోవటం లేదు ! ' అన్నాడు.

ఆ మాట విన్నాక నాకెంతో సంతోషం కలిగింది !

అతని మాటల్లో నిజాయితీ, నీ పట్ల వున్న అపరిమితమైన ప్రేమాభిమానాలూ కనిపించాయి. అప్పటివరకూ మీ అత్తా మామగార్లు అడుగుతున్న కోరికలు విని విసుగుతో వున్న నాకు సాకేత్ మాటలు...అమృత చినుకుల్లా అనిపించాయి! నేను చటుక్కున లేచి వెళ్ళి సాకేత్ చేతులు పట్టుకుని ' ఎంత విలువైన మాట చెప్పారండీ..మీరు మా ఇంటి అల్లుడు కావడం మా అందరి అదృష్టం ! మా చెల్లెలి పట్ల మీరు చూపించిన ప్రేమాభిమానాలకు ముగ్ధుడినైపోయాను.  ఇపుడు చెబుతున్నా వినండి...మా ఆస్తి మొత్తం మా చెల్లెలుకే ఇచ్చేసినా, ఏ మాత్రం నేను అభ్యంతరం చెప్పను..ఆనందిస్తానుగానీ !' అని అన్నావట కదా ! ఇది ఆయనే తర్వాత చెప్పి, ' అలాంటి అన్నయ్య ఉన్నందుకు నువ్వు చాలా అదృష్టవంతురాలివీ ' అని అన్నారు కూడా.

అపుడు నాకో విషయం గుర్తుకు వచ్చింది. చిన్నప్పుడు నీ వస్తువు ఏదో నేనడిగితే, ఏ మాత్రం ఆలోచించకుండా 'తీసుకో' అన్నావు. అపుడే నిన్ను ఓ మాట అడిగాను.  ' నీకేదీ కావాలని అనిపించదా, వెంటనే ఇచ్చేస్తానంటున్నావూ..?' అని. 'నా దగ్గర ఉంచుకోవటం కంటే, నాకెంత ఇష్టమైనదైనా సరే, నీకు కావాలనిపిస్తే,

నీకు ఇవ్వటంలోనే నాకు మరింత ఆనందం కలుగుతుంది ! అలాంటప్పుడు నీకు ఇవ్వటంలో నాకు కష్టం ఏముంటుందీ ?' అని జవాబిచ్చావు.

నిజమే అన్నయ్యా....ఇవ్వటంలోని ఆనందాన్ని నేను నీ దగ్గర్నుండే నేర్చుకున్నాను కదా...మరి ఇపుడేమిటీ..ఇలా ఆలోచిస్తున్నానూ అనే మథన మనసులో మొదలైంది ! ఏ స్వార్థం అనే భూతం నన్ను లోబరుచుకుందీ...?అన్నీ నాకే కావాలనే దురాశ ఎందుకు నాలో వచ్చిందీ..? అనే ఆత్మ విమర్శ చేసుకుంటే, నాకే చాలా సిగ్గుగా అనిపించింది ! నేనడిగితే, అది తనకెంత ఇష్టమైనదైనా సరే, ఇచ్చెయ్యగలిగే అన్నయ్య ప్రేమ ఒక్కటీ చాలదా అని నాకు అనిపించింది !

అవును అన్నయ్యా....నాన్న మనకెన్నో విషయాలను అప్పుడప్పుడూ చెబుతూ ఉండేవారు. డబ్బును ఎవరైనా సంపాదించగలగాలని అనుకోవాలి ! డబ్బు ఉంటే..ఎన్నో సుఖాలూ, సౌకర్యాలూ ఏర్పడతాయన్నది ఎవరూ కాదనలేని నిజం ! అయితే...ఆ డబ్బుకు బంధాలూ, అనుబంధాలకూ మించిన ప్రాముఖ్యతను మాత్రం ఇవ్వకూడదూ అని. నాన్న మనకు చెప్పిన ఈ మాటల్లో మొదటి సగాన్ని మాత్రమే నేను వంటబట్టించుకున్నానేమో....అందుకే సంపద మీద ఆశతో అంతా నాకే కావాలనుకున్నాను. నువ్వేమో రెండో సగాన్ని బాగా అర్థం చేసుకుని ఆచరించగలుగుతున్నావనిపించింది !

అలా నాలో నేనే మథనపడుతూ ఉండగా ఎందుకో అమ్మ బాగా గుర్తు వచ్చింది. వెంటనే చూడాలనిపించింది కూడా....ముందుగా నీ దగ్గరకు వచ్చి అమ్మ దగ్గరకి వెళ్దాం అనుకున్నానుగానీ, మొహం చెల్లక నేరుగా అమ్మ దగ్గరకు వెళ్ళాను నిన్ననే...అమ్మ చాలా దీర్ఘంగా ఆలోచిస్తూ వుంది మరి ఏమిటో... మెల్లగా వెళ్ళి అమ్మ కాళ్ళ దగ్గర కూర్చున్నా...కొద్ది సేపటికి అమ్మ చెయ్యి చల్లగా నా తలపై పడింది. “అమ్మా” పిలిచాను ఆర్ద్రంగా.